ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 10 సెప్టెంబరు 2024



బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద వరద ధాటికి కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డు



గొలుగొండ మండలం కొత్తవెల్లవరంలో ఇళ్లలోకి చేరిన వరద నీరు




చోడవరం మండలం రామజోగిపాలెం వద్ద నీటమునిగిన వరి, చెరకు పొలాలు

ముంచేసిన వాన

రిజర్వాయర్లకు వరద తాకిడి

- రైవాడ మినహా అన్ని జలాశయాల గేట్లు ఎత్తివేత
- వరదతో పోటెత్తిన నదులు, వాగులు, గెడ్డలు
- 1,528 హెక్టార్లలో నీట మునిగిన వరిపైరు
- రూ.2.59 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా
- వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న ఇతర పంటలు
- బుచ్చెయ్యపేట మండలంలో కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ కాజ్‌వే
- వడ్డాది వద్ద పెద్దేరు కాజ్‌వేపై వరద ఉధృతి
- మాడుగుల, పాడేరు ప్రాంతాలకు స్తంభించిన రోడ్డు రవాణా
- పలుప్రాంతాల్లో కాజ్‌వేలు, రోడ్లమీదుగా ప్రవహించిన వరద నీరు
- వాహనాల రాకపోకలను నిలిపేసిన అధికారులు



కోటవురట్ల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా నది

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో జిల్లా అతలాకుతలమైంది. ఆదివారం మధ్యాహ్నం వరకు వరద ప్రభావం పెద్దగా లేకపోవడంతో ముప్పు తప్పినట్టేనని రైతులు భావించారు. కానీ సాయంత్రం నుంచి నదులు, గెడ్డలు, వాగుల్లో వరద ప్రవాహం పెరిగిపోయింది. సోమవారం ఉదయానికి మరింత ఉగ్రరూపం దాల్చింది. దీంతో నదులు, గెడ్డలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. వీటికి ఇరువైపులా వున్న గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా వుండాలని అధికారులు దండోరా వేశారు. సాగునీటి జలాశయాలు, చెరువులు పూర్తిగా నిండాయి. రిజర్వాయర్ల గేట్లు ఎత్తి, వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. చెరువులు నిండిపోయి, వరద నీరు పొర్లుకట్టల మీదుగా దిగువకు పోతున్నది. లోతట్టు ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీటమునిగాయి. హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక, ఎంపీ సీఎం రమేశ్, పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటించి, నీట మునిగిన పంటలను పరిశీలించారు. కాగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వీఆర్వోలు మూడు రోజులపాటు అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు నేతృత్వంలో వ్యవసాయాధికారులు బృందాలుగా ఏర్పడి, పొలాల్లో పర్యటించి ముంపునకు గురైన పంటలను పరిశీలించారు. ప్రాథమిక ... మిగతా 6వ పేజీలో



పాయకరావుపేట మండలం సత్యవరం వద్ద బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న తాండవ నీరు

రాత్రంతా భారీ వర్షం

అనకాపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఆదివారం రాత్రంతా భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం 8 గంటల వరకు జిల్లా సగటు వర్షపాతం 76.4 మి.మీ.లుగా నమోదైంది. అత్యధికంగా పాయకరావుపేట మండలంలో 105 మి.మీ.ల వర్షం కురిసింది. దేవరాపల్లి మండలంలో 75.8 మి.మీ.లు, ఎస్.రాయవరంలో 86.6, గొలుగొండలో 94.2, ఎలమంచిలిలో 72, రావికమతంలో 87.8, కశింకోటలో 65.8, కోటవురట్లలో 82.6, మునగపాకలో 77.2, నక్కపల్లిలో 71.8, పరవాడలో 74.2, నాతవరంలో 100.8, రాంబిల్లిలో 79.4, అచ్యుతాపురంలో 65.8, రోలుగుంటలో 84.6, మాకవరపాలెంలో 84.2, కె.కోటపాడులో 83.4, అనకాపల్లిలో 62.4, చోడవరంలో 70.4 నర్సీపట్నంలో 77.8, సబ్బవరంలో 56.4, మాడుగులలో 54.6, బుచ్చెయ్యపేటలో 68.4, చీడికాడలో 51.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

ఉధృతంగా పెద్దేరు, తాచేరు

- కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డు
- వడ్డాది కాజ్‌వే, కస్పా గ్రోయిన్‌పై పొంగి ప్రవహించిన పెద్దేరు
- బీఎన్ రోడ్డులో రవాణా కష్టాలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 9: భారీ వర్షాలతోపాటు రిజర్వాయర్ల గేట్లు ఎత్తడంతో మండలంలో పెద్దేరు, తాచేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై గతంలో కూలిన వంతెన పక్కన నిర్మించిన డైవర్షన్ కాజ్‌వే వరద ధాటికి కొట్టుకుపోయింది. దీంతో వాహనాలను వేరే మార్గాల్లోకి మళ్లించారు. వడ్డాది వద్ద కాజ్‌వేపై నుంచి పెద్దేరు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో మూడు జిల్లాలకు రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాగా నదుల్లో వరద పెరగడంతో వడ్డాది, విజయరామరాజుపేట రెవెన్యూ పరిధిలో సుమారు 100 ఎకరాల్లో వరి పైరు నీటమునిగింది.



పైడివాడ అగ్రహారంలో నీట మునిగిన రిటర్నబుల్ ప్లాట్లు

నీట మునిగిన రిటర్నబుల్ ప్లాట్లు

- లబోదిబోమంటున్న బాధిత రైతులు

సబ్బవరం, సెప్టెంబరు 9 : గత ప్రభుత్వం పైడివాడ అగ్రహారం, పైడివాడ, ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో జగనన్న ఇళ్ల కాలనీల కోసం సేకరించిన భూమికి పరిహారం కింద రైతులకు ఇచ్చిన ప్లాట్లు వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు లబోదిబోమంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో లేఅవుట్లు మొత్తం నీటమునిగాయి. మట్టి, మెటల్ రోడ్లు కొట్టుకుపోయాయి. పై మూడు గ్రామాల్లో సుమారు 200 మంది రైతుల నుంచి 320 ఎకరాలు సేకరించి పట్టణ పేదలకు సెంటు చొప్పున ఇంటి స్థలం ఇచ్చారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని గత వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే గెడ్డలు, వాగుల్లో ప్లాట్లు ఇచ్చారని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని రైతులు అక్కిరెడ్డి దుర్గినాయుడు, బొబ్బిలి కన్నారావు, గొంతిన పైడిరాజు తదితరులు కోరుతున్నారు.

రిజర్వాయర్లు ఫుల్

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో జిల్లాలోని అన్ని రిజర్వాయర్లకు వరద పోటెత్తింది. రైవాడ మినహా మిగిలిన అన్ని జలాశయాలు పూర్తిగా నిండడంతో అధికారులు స్పిల్‌వే గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఆయా నదులు వరదతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

స్పిల్‌వే గేట్లు ఎత్తివేత

వేలాది క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల




గేట్లు ఎత్తిన కల్యాణపులోవ జలాశయం

కల్యాణపులోవ నుంచి 400 క్యూసెక్కులు విడుదల

రావికమతం: మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి వరదపోటు మరింత పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో కొండగెడ్డల ద్వారా వరద నీరు రిజర్వాయర్‌లోకి వస్తున్నది. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులుకాగా సోమవారం 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఇప్పటికే రిజర్వాయర్ నిండడంతో నీటి మట్టాన్ని 459.1 అడుగులకు మించకుండా నాలుగు గేట్లు ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నట్టు ప్రాజెక్టు ఏఈ సత్యనారాయణదొర చెప్పారు.

పెద్దేరు నుంచి 600 క్యూసెక్కులు..

మాడుగుల రూరల్: పెద్దేరు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా.. సోమవారం 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుంది. నీటిమట్టాన్ని 135.6 మీటర్ల వద్ద స్థిరంగా వుంచుతూ, స్పిల్‌గేట్ల నుంచి 600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు.



పెద్దేరు జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

రైవాడకు వరద పోటు.. 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

దేవరాపల్లి: ఎగువ ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షాలు కురవడంతో రైవాడ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, సోమవారం 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో నీటిమట్టం 111.5 మీటర్లకు చేరింది. నీటిమట్టం మరో రెండు మీటర్లు పెరిగితే స్పిల్‌వే గేట్లు ఎత్తుతామని ప్రాజెక్టు డీఈఈ సత్యం నాయుడు చెప్పారు. కాలువల ద్వారా జీవీఎంసీకి 50 క్యూసెక్కులు, ఆయకట్టుకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

తాండవ నుంచి 8 వేల క్యూసెక్కులు విడుదల

నాతవరం: మండలంలోని తాండవ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా, నాలుగైదు రోజుల క్రితమే రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీంతో అధికారులు స్పిల్‌వే గేట్లు కొంతమేర ఎత్తి అదనపు నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. అయితే పరివాహక ప్రాంతంలో ఆదివారం భారీ వర్షాలు కురవడంతో పలు గెడ్డల నుంచి సోమవారం 8,700 వేల క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి వస్తున్నది. అధికారులు మూడు స్పిల్‌వే గేట్లను ... మిగతా 6వ పేజీలో

కాజ్‌వేలు, కల్వర్టులపై వరద

- కుంగిన వంతెన, కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు
- పలు ప్రాంతాల్లో స్తంభించిన రవాణా
- కొన్ని రూట్లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దు



ఎస్.రాయవరంలో వంతెన మీదుగా ప్రవహిస్తున్న వరహా నది వరద

అనకాపల్లి (ఆంధ్రజ్యోతి)/ నర్సీపట్నం/ అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9:

తీవ్ర వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో జన జీవనానికి అంతరాయం కలిగింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పలుచోట్ల రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బుచ్చెయ్యపేట మండలంలో తాచేరు డైవర్షన్ రోడ్డు వరద ధాటికి కొట్టుకుపోయింది. ఇదే మండలంలో వడ్డాది వద్ద పెద్దేరు నది తాత్కాలిక కాజ్‌వేను ముంచెత్తింది. నాతవరం మండలంలో వెదుళ్ల గెడ్డ పొంగడంతో నర్సీపట్నం- తుని మధ్య రాకపోకలు స్తంభించాయి. చీడికాడ, మండలం ఖండివరం సమీపంలో కాజ్‌వే కొట్టుకుపోవడంతో మాడుగులకు రాకపోకలు నిలిచిపోయాయి. పాయక రావుపేట మండలంలో తాండవ నది ఉగ్రరూపం దాల్చడంతో సత్యవరం వద్ద వంతెన మీదుగా వరద ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలు ఆపేశారు. ఇంకా ఎస్.రాయవరం, కోటవురట్ల, మాడుగుల, తదితర మండలాల్లో కల్వర్టులు, ఎత్తు తక్కువ వంతెనల మీదుగా వరద నీరు ప్రవహించింది. దీంతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో వివిధ ప్రాంతాలకు నడిచే 36 బస్సులను సోమవారం రద్దు చేసినట్టు డీపీటీవో పద్మావతి తెలిపారు. నర్సీపట్నం నుంచి విశాఖ వైపు మినహా మిగిలిన అన్ని రూట్‌లలో బస్సులను నిలుపుదల చేశామని ఆమె చెప్పారు. బుచ్చెయ్యపేట మండలంలో డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడం, వడ్డాదిలో కల్వర్టుపై వరద ప్రవహించడంతో మాడుగుల వైపు ఒక్క బస్సు కూడా నడవలేదన్నారు. నర్సీపట్నం నుంచి శరభన్నపాలెం, కొయ్యూరు బస్సులు కృష్ణాదేవిపేట వరకు మాత్రమే తిప్పారు. దీంతో నర్సీపట్నం బస్టేషన్ బోసిపోయింది. మధ్యాహ్నం తరువాత కొన్ని రూట్లలో బస్సులను పునరుద్ధరించారు. చింతపల్లి మార్గంలో కాజ్‌వేలు కుంగిపోవడంతో మంగళవారం కూడా బస్సులు నడవవని అధికారులు తెలిపారు. అడ్డురోడ్డు వైపు వెళ్లే బస్సులు కోటవురట్ల మండంల రామచంద్రపురం వంతెన వరకు, చోడవరం, మాడుగుల బస్సులు వడ్డాది వరకు నడుపుతారు.



ఖాళీ వున్న నర్సీపట్నం ఆర్టీసీ బస్ స్టేషన్ ప్లాట్‌ఫారాలు

పలువురు సీఐలు బదిలీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9: విశాఖ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం రేంజ్ వీఆర్‌లో ఉన్న వానపల్లి నాగరాజును శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎంవీవీ రమణమూర్తిని విజయనగరం జిల్లా వీఆర్‌కు, రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న ఎం.బుచ్చిరాజును అనకాపల్లి జిల్లా పీసీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న జి.దుర్గాప్రసాద్‌ను ఏఎస్ఆర్ జిల్లా సోషల్ మీడియా సైబర్ సెల్‌కు, వీఆర్‌లో ఉన్న జీఆర్‌కే తులసీదాస్‌ను శ్రీకాకుళం జిల్లా డీటీసీకి, వీఆర్‌లో ఉన్న ఎస్.రామును ఏఎస్ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్‌కు, వీఆర్‌లో ఉన్న జి.గోవిందరావును నర్సీపట్నం టౌన్‌కు, నర్సీపట్నం టౌన్‌లో ఉన్న టి.క్రాంతికుమార్‌ను విశాఖ రేంజ్ వీఆర్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్‌కే గఫూర్‌ను అనకాపల్లి జిల్లా వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇండేశమ్మ ఘాట్‌రోడ్డుకు మరమ్మతు

- రామచంద్రపురం వద్ద డైవర్షన్ రోడ్డు
- అధికారులకు హోం మంత్రి అనిత ఆదేశం



రామచంద్రపురం వద్ద కుంగిన వంతెనను పరిశీలించిన మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్

కోటవురట్ల, సెప్టెంబరు 9: భారీ గోతులు ఏర్పడి, అధ్వానంగా ఉన్న ఇండేశమ్మ ఘాట్‌రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఇండేశమ్మఘాట్ రోడ్డుతోపాటు రామచంద్రపురం వద్ద రెండు రోజుల క్రితం కుంగిన పురాతన వంతెనను ఆమెతోపాటు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, కుంగిపోయిన వంతెనను తొలగించి పక్కనే డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నీటి మునిగిన పంటలపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపాలను అధికారులకు సూచించారు. ఆమె వెంట నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమంతి, ఈఈ రమేశ్, టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, జానకి శ్రీనివాసరావు, తదితరులు వున్నారు.

విభూది అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు సోమవారం విభూది అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి విభూది అలంకరణలో స్వామిని ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. - చోడవరం

అతలాకుతలం

వాయుగుండంతో కురిసిన వర్షాలు ఉమ్మడి విశాఖ జిల్లాను అతలాకుతలం చేశాయి. నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పంటలను ముంచెత్తాయి. పలు నదులు, వాగులు కోతకు గురయ్యాయి. రోడ్లపై వరద నీరు ప్రవహించింది. రోడ్లకడ్డంగా చెట్లు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


బుచ్చెయ్యపేట: వడ్డాది కస్పా గ్రోయిన్‌పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు


చోడవరం: చాకిపల్లి వద్ద వరద ముంపులో వరి పొలాలు, చెరకు తోటలు


నర్సీపట్నంలో వరాహ నది చెక్‌డ్యామ్ మీద నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



అనంతగిరి: బొర్రా గుహలు మూసివేతతో వేచి ఉన్న పర్యాటకులు


రాంబిల్లి మండలం రాజుకోడూరు వద్ద ముంపునకు గురైన వరి పొలాలు


ఎస్.రాయవరం: సోముదేవుపల్లి వద్ద వరాహ నది ఉధృతితో కోతకు గురవుతున్న గట్టు


నాతవరం: గన్నవరం మెట్ట వద్ద తుని-నర్సీపట్నం రోడ్డుపై ప్రవహిస్తున్న ఎర్రిగెడ్డ

జల దిగ్బంధంలో పూడిమడక

- ఆందోళనకు గురైన మత్స్యకారులు
- సాయంత్రానికి శాంతించిన ఉప్పుటేరు

అచ్యుతాపురం, సెప్టెంబరు 9: మండలంలోని తీర ప్రాంత గ్రామమైన పూడిమడక జల దిగ్బంధంలో చిక్కుకుంది. సోమవారం ఉదయం ఉప్పుటేరు పొంగడంతో పూడిమడక గ్రామం చుట్టూ నీరు చేరింది. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. జాలారిపాలెం దాటిన తర్వాత పొగిరి వద్ద ప్రారంభమైన ఉప్పుటేరు పూడిమడక శివారు కడపాలెం వద్ద మళ్లీ సముద్రంలో కలుస్తుంది. సోమవారం పోటు సమయంతో భారీగా ఉప్పుటేరు పొంగి పూడిమడక చుట్టూ నీరు చేరి సముద్రంలా తయారైంది. రాత్రికి కూడా ఇదే పరిస్థితి కొనసాగితే కడపాలెం శివారు సముద్రం వద్ద గండి కొట్టాలని మత్స్యకారులు భావించారు. లేకుంటే కడపాలెం మునిగి పోతుంది. గతంలో చాలా సార్లు ఇదే విధంగా చేసి మత్స్యకారులు తమ గ్రామాన్ని కాపాడుకున్నారు. అయితే సోమవారం సాయంత్రం నుంచి వర్షం తగ్గడంతో ఉప్పుటేరు శాంతించింది. దీంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు.


ఉప్పుటేరు పొంగడంతో పూడిమడక చుట్టూ చేరిన నీరు

ఆక్రమణలు తొలగింపు

పూడిమడక తీరంలో ఆక్రమణలను సోమవారం అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కడపాలెంలో సముద్రానికి అతి తక్కువ దూరంలో కొందరు మత్స్యకారులు పాకలు, పశువుల శాలలు వేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. వాయుగుండం కారణంగా సముద్రం పాకలు వరకు వచ్చింది. దీంతో అధికారులు సోమవారం ఎక్స్‌కవేటర్‌తో వీటిని తొలగించారు.

చోడపల్లి వద్ద కూలిన భారీ వృక్షం

ఐదు గంటలు ట్రాఫిక్ జామ్

అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారిలో చోడపల్లి వద్ద భారీ మర్రి వృక్షం సోమవారం రోడ్డుకడ్డంగా పడిపోయింది. దీంతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 11 గంటల సమయంలో భారీ వృక్షం పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందిన వెంటనే పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ నమ్మి గణేష్, ఎస్ఐ వెంకటరావు చెట్టు పడిపోయిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. భారీ వాహనాలను సాదుపాకలు జంక్షన్, కొండకర్ల, బంగారయ్యపాలెం, మడుతూరు జంక్షన్ మీదుగా అచ్యుతాపురానికి మళ్లించారు. చిన్న వాహనాలను పక్కనే గల లేఅవుట్ నుంచి మళ్లించారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తక్షణం స్పందించి నలుగురు కట్టర్‌లు, నాలుగు ఎక్సకవేటర్లు ఏర్పాటుచేశారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు చెట్టుని తొలగించి ట్రాఫిక్‌ని పునరుద్ధరించారు.


కూలిన భారీ వృక్షాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

ఎస్పీ ఎం.దీపిక


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లకు ప్రజల నుంచి అందుతున్న వినతులను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా 10 మంది ఫిర్యాదుదారులతో ఆమె విడివిడిగా మాట్లాడి పరిష్కార మార్గాలు చూపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసు స్టేషన్‌లకు అందుతున్న ఫిర్యాదులను చట్టపరిధిలో నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలని ఆదేశించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'11న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి'


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 11వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీనగరం కల్యాణ మండపంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ కన్వీనర్ మర్రా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు కూడా వర్గీకరణ తీర్పుపై పునః సమీక్ష చేయాలని కోరారు. నవంబరు నెలలో మాలల సింహగర్జన ఏర్పాటు చేసి మాలల సత్తా ఏమిటో నిరూపిద్దామన్నారు. రాష్ట్ర దళితసేన అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ ఇప్పటికైనా అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు వ్యవస్థాపకులు కేబీ ఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ ఎన్‌ఏడీ పాల్, దాసరి చెన్నకేశవులు, రాజేంద్ర ప్రసాద్, పల్లా బాబ్జి, బాలకృష్ణ, దయాల్‌రాజ్, గోడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాగారాల గెడ్డకు గండి


గండిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మనోరమ, అధికారులు

మాకవరపాలెం, సెప్టెంబరు 9: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జి.కోడూరు జాగారాల గెడ్డకు పడిన గండిని మండల ప్రత్యేకాధికారి కె.మనోరమ సోమవారం పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఈ గెడ్డకు గండి పడడం, వరి పంట నష్టపోవడం జరుగుతుందని రైతులు ఆమెకు వివరించారు. గెడ్డకు సిమెంటు వాల్ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని, అలాగే గెడ్డకు సిమెంట్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో సీతా మహాలక్ష్మి, ఏవో చిరంజీవి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాకవరపాలెం, సెప్టెంబరు 9: మండలంలో ప్రమాదవశాత్తూ ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలో రామన్నపాలెం గ్రామానికి చెందిన కర్రి రాము(45) సోమవారం ఉదయం ఇంటి నుంచి బైకుపై జగనన్న కాలనీకి వెళుతుండగా బ్రేక్ వేయడంతో కిందకు పడిపోయాడన్నారు. ఆ సమయంలో రాము తలకు బలమైన గాయం తగలడంతో స్థానికులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మాడుగులకు బస్సులు రద్దు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 9: భారీ వర్షాల కారణంగా విజయరామరాజుపేట-వడ్డాది మధ్య తాచేరు గెడ్డపై తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో మాడుగులకు బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. అలాగే సోమవారం ఖండివరం-మాడుగుల మధ్యలో పంట కాలువపై వేసిన కల్వర్టు, రోడ్డు కోతకు గురై భారీ గండి పడింది. దీంతో ఆటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు రద్దు చేశారు. అప్పలరాజుపురం నుంచి కొత్త బోయపాడు మీదుగా మాడుగులకు రోడ్డు సదుపాయం ఉన్నప్పటికీ వర్షాలు దృష్ట్యా ఆటంకాలు ఎదురవుతాయని ఆర్టీసీ బస్సులు ఈ రూట్లో తిప్పలేదు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాముడు ఎంపిక

దేవరాపల్లి, సెప్టెంబరు 9: మండలంలోని కాశీపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి రెడ్డి రాముడు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు బీటీ. సుందరి తెలిపారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో కాకినాడ జిల్లా అన్నవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని ఆమె తెలిపారు. విద్యార్థిని, ఉపాధ్యాయుడు కె.రాంబాబులను సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, వంటాకు పైడితల్లమ్మ, ఆదిరెడ్డి సింహాచలంనాయుడు తదితరులు అభినందించారు.

'పెద్దేరు'ను పరిశీలించిన కలెక్టర్


పెద్దేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

మాడుగుల రూరల్, సెప్టెంబరు 9: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయాన్ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం పరిశీలించారు. జలాశయం స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జలాశయం నీటి సామర్థ్యాన్ని లెక్కించాలని, నీరు విడిచిపెట్టేటప్పుడు దిగువ ప్రాంతాల వారికి సమాచారమిచ్చి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దారు పీవీరత్నం, జలాశయం అధికారులు సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం, ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

జిల్లా అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష

నక్కపల్లి, సెప్టెంబరు 9: వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాల అనంతరం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమయంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ దీపికలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద తీవ్రత వున్న పంచాయతీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డీపీవో శిరీషారాణిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాలకు 3,600 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగినట్టు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు వివరించారు. గ్రామాల్లో జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు సూచనలు చేసి, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతిని హోం మంత్రి ఆదేశించారు. ప్రజలకు తాగునీరు ఇబ్బంది లేకుండా చూసుకోవల్సిన బాధ్యత అధికారులపై వుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పరిస్థితిని టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, కురందాసు నూకరాజు, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశంలో ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐలు కుమారస్వామి, అప్పన్న, ఎస్ఐలు సన్నిబాబు, విభీషణరావు పాల్గొన్నారు.


వరద నష్టంపై అధికారులతో సమీక్ష జరుపుతున్న హోం మంత్రి అనిత

రైతులను ఆదుకునేందుకు చర్యలు


శంకరం వద్ద వరి పొలాలను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేష్


మార్టూరు వద్ద వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, సెప్టెంబరు 9 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం నీట మునిగిన పంట పొలాలను వారు వేర్వేరుగా పరిశీలించారు. శంకరం, బొజ్జన్నకొండ, దిబ్బపాలెంలో నీట మునిగిన వరి పొలాలను ఎంపీ సీఎం రమేశ్ పరిశీలించి స్థానిక రైతులు, అధికారులతో మాట్లాడారు. రైతాంగానికి ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన పొలాల్లో నీట తరలింపునకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే కాలువల్లో పూడిక, తుప్పల తొలగింపులను చేపట్టాలని ఆదేశించారు. తుమ్మపాల, మార్టూరు ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వ్యవసాయాధికారులు నిత్యం అందుబాటులో ఉంటారని, రైతుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వరద నివారణ చర్యలు సత్వరమే చేపట్టాలి

- కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆదేశం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 9: వరద నివారణ చర్యలు సత్వరమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం భారీ వర్షాలకు బీఎన్ రోడ్డులో మునిగిన వడ్డాది కాజ్‌వే, కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డులను ఆమె పరిశీలించారు. వడ్డాది కాజ్‌వే వద్ద చిక్కుకుపోయిన తుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించాలని, తాచేరు డైవర్షన్ రోడ్డుకు ఇరువైపులా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాచేరు వంతెన నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ సాయి శ్రీనివాసరావును కలెక్టర్ ప్రశ్నించారు. కాంట్రాక్టరు నిర్మాణ పనులు చేపట్టలేదని ఏఈఈ వివరించారు. కాంట్రాక్టరు, ఆర్‌అండ్‌బీ ఈఈ బుధవారం తన కార్యాలయంలో కలిసేలా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ చిన్నికృష్ణను కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆదేశించారు. డైవర్షన్ వందలాది ఎకరాల్లో పంట నీట ముంపునకు గురైందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. పొలాల్లోని ముంపునీరు పోయేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.


వరద నీట మునిగిన వడ్డాది కాజ్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్


వడ్డాది కాజ్‌వేపై ఉన్న తుప్పలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆర్‌అండ్‌బీ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

బీఎన్.రోడ్డులో బంగారుమెట్ట కూడలి వద్ద గొయ్యిలు బావులను తలపిస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆర్‌అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అనకాపల్లి నుంచి వడ్డాదికి కశింకోట-బంగారుమెట్ట(కేబీ) రోడ్డు ద్వారా చేరుకున్నారు. బంగారుమెట్ట కూడలి వద్ద భారీ గొయ్యిలను చూసి ఆమె కారు ఆపి కిందకు దిగారు. ఇంత భారీ గొయ్యిలు ఏర్పడినా మరమ్మతులు చేపట్టకపోవడాన్ని ఆమె ఆక్షేపించారు. తాను మండల పర్యటన ముగించేలోగా, మరమ్మతు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో అధికారులు హుటాహుటీన ఎక్స్‌కవేటర్‌తో బంగారుమెట్ట కూడలి వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. వడ్డాది కాజ్‌వేలో చిక్కుకున్న తుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, హెచ్‌డీటీ అరుణ్‌చంద్ర, వీఆర్వో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎంవీ.బాలాజీ

పాయకరావుపేట, సెప్టెంబరు 9 : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎంవీ.బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ అమలు, గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అంతరం ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు వైద్య సేవలు అందజేయాలన్నారు. అదేవిధంగా ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను పీహెచ్‌సీకి తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్, ఎంపీఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524


పాయకరావుపేట పట్టణంలోని చాకలిపేటలో రోడ్డుపైకి వచ్చిన నీరు


కశింకోట : ఎన్జీపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల


రాంబిల్లి : మురకాడలో శారదా గట్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు


అచ్యుతాపురం : వాడపాలెం పాము గెడ్డకు గండి కొట్టిన దృశ్యం

జలమయం

- వాయుగుండంతో భారీ వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, గెడ్డలు
- ముంపుబారిన పలుచోట్ల పంట పొలాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


అనకాపల్లి మండలంలో చెరువును తలపిస్తున్న ఆవఖండంలో వరి పొలాలు

రాంబిల్లి, సెప్టెంబరు 9 : వాయిగుండం ప్రభావంతో భారీగా కురిసిన వర్షాలకు మండలంలోని ప్రధాన మేజర్, మైనర్ శారదా నదులు ఉరకలేస్తూ జోరుగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడడంతో బలహీనంగా ఉన్న నదుల గట్లను ఆనుకొని ఉధృతంగా ప్రవాహం సాగుతుండడంతో ఆయా పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తూరు వద్ద మేజర్ శారదా, నారాయణపురం వద్ద మైనర్ శారదాలు వంతెనలను ఆనుకొని ప్రవహిస్తున్నాయి. మురకాడ వద్ద మైనర్ శారదా నదిగట్టు కొంత మేర కోతకు గుర్వడంతో రైతులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై ఇసుక బస్తాలతో గట్టు వద్ద చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలైన మత్రిపాలెం, మురకాడ, కుమ్మరాపల్లి, వెల్చూరు, పంచదార్ల, రాజుకోడూరు, కొప్పుగొండుపాలెం తదితర గ్రామాల్లోని వరిపంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మండలంలోని సుమారు 150 ఎకరాల వరకు వరి పంట ముంపునకు గురైనట్టు బాధితులు చెపుతున్నారు. ఇదిలావుంటే, మేజర్, మైనర్ శారదా నదులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పలు శాఖల అధికారులతో కలిసి వెళ్లి పరిశీలించారు. పంచదార్ల, కొత్తూరు వద్ద నీట మునిగిన వరిపంట పొలాలను పరిశీలించారు. తహసీల్దార్ వి.భాగ్యవతి, ఎంపీడీవో కొండలరావు, ఎలమంచిలి ఏడీఏ బి.ప్రభాకర్, ఏవో సుమంత, ఇరిగేషన్ అధికారులతో పాటు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు డి.దిన్‌బాబు, పలుశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కశింకోట : తాజాగా కురిసిన వర్షాలకు నీట మునిగిన పంటపొలాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. మండలంలోని నూతనగుంటపాలెం, ఏనుగుతుని, తాళ్లపాలెం, గైతలపాలెం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి కాలువలను, పంటపొలాలను పరిశీలించారు. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జనసేన నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, కలిగట్ల సింహాద్రి, కలగా గోవింద, కర్రి గోవింద, టీడీపీ నాయకులు అందే రమణ, ఎలమంచిలి వెంకట్రావు, కలగట్ల సంజీవి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో వరిపొలాలు మొత్తం నీటమునిగాయి.

పాయకరావుపేట : తాండవ జలాశయం నుంచి నదిలోకి నీటిని విడుదల చేయడంతో పాయకరావుపేట వద్ద తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం ఉదయం నుంచి గంట గంటకు నదిలో నీటి ప్రవాహం పెరుగుండడంతో పట్టణంలోని పాండురంగస్వామి ఆలయం వెనుక తాండవ నదిని ఆనుకుని ఉన్న ఏటి ఒడ్డువీధి, చాకలిపేట, తోకలవారివీధి, పార్కువీధి తదితర ప్రాంతాల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎస్.రాయవరం : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరహానది ఉధృతంగా ప్రవహిస్తుంది. మండలంలోని సోముదేవుపల్లి వద్ద ఇప్పటికే చాలావరకు కోతకు గురై ఉన్న నది గట్టుకు ప్రస్తుతం నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం కనిపిస్తుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి వరహానది గట్టును తహసీల్దార్ కె.విజయకుమార్ సిబ్బంది కలిసి పరిశీలించారు.ఇదిలావుంటే, ఎస్.రాయవరం వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి వరహానది ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు అప్రమత్తమై ఆ మార్గంలో రాకపోకలు చేసే లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, పిట్లపాలెం గ్రామాల ప్రజలను అటువైపు వెళ్లకుండా సుమారు మూడు గంటల పాటు నిలిపివేశారు.ఆ తరువాత సాయంత్రానికి తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు సాగాయి. వరద కారణంగా మండలంలో మొత్తం సుమారు నాలుగు వందల ఎకరాల్లో వరిపొలం నీట మునిగినట్టు మండల వ్యవసాయాధికారిణి సౌజన్య తెలిపారు. రామయ్యపట్నంలో పెదపాటి అప్పారావు అనే వ్యక్తికి చెందిన పెంకుటిళ్లు వర్షాలకు అది పూర్తిగా కూలిపోయిందని, అలాగే వమ్మవరం, సైతారుపేటలకు చెందిన రెండుపెంకుటిళ్లలు స్వల్పంగా దెబ్బతిన్నాయని తాహసీల్దార్ విజయకుమార్ తెలిపారు.

ఎలమంచిలి : వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, ముంపు పొలాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పరిశీలించారు. తొలుత పట్టణంలో ఇటీవల పొంగిన శేషుగెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. మునిసిపాలిటీలోని రామారాయుడుపాలెం గ్రామానికి వెవెళ్లే కల్వర్టు దెబ్బతినడంతో అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు. అదే విధంగా కట్టుపాలెం, పీఎస్ఆర్‌పేట, పులపర్తి గ్రామ సమీపాల్లో ముంపుకు గురైన పంటపొలాలను పరిశీలించారు. నాయకులు కొఠారు సాంబ, ఇత్తంశెట్టి రాజు, గెంజి శ్రీను, పందూరి శ్రీను, బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె బాబూరావు, కాళ్ల శ్రీను, పూడి రామకృష్ణలు పాల్గొన్నారు.


పాయకరావుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ

సబ్బవరం : భారీ వర్షాల పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. తుఫాన్ తీవ్రతపై సోమవారం ఇక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటైన సమీక్షలో మాట్లాడారు. మంగళవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో రెవెన్యూ, హెల్త్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు, పోలీస్‌శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతింటే అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ ఝాన్సీరాణి, వెంకట్, ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పలుచోట్ల రైతుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. జగ్గంపేటలోని మెలిపాక గెడ్డ లాకుల వద్ద వరద నీటితో పాటు భారీగా చెత్త, మొక్కలు కొట్టుకువచ్చి లాకులకు అడ్డం పడిపోయాయి. దీంతో నీటి ప్రవాహం సక్రమంగా సాగక పక్కనే ఉన్న పొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు సదరు చెత్తను తొలగించారు. అలాగే వాడపాలెం వద్ద పాముగెడ్డ భారీ స్థాయిలో ప్రవహించింది. ఈ గెడ్డలోని నీర. తంతడి శివారు వాడపాలెం వద్ద సముద్రంలో కలవాలి. ఈ గెడ్డ ద్వారా ఎప్పుడూ ఎక్కువ నీరు రాదు. వచ్చినా సముద్రపు ఇసుకలో ఇంకి పోతుంది. కానీ గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డ భారీ స్థాయిలో వచ్చింది. నీరు సముద్రంలోకి వెళ్లే మార్గం లేకపోవడంతో ఎగువకు తన్ని పెట్టింది. దీంతో వాడపాలెం, తంతడి మధ్యనున్న వంతెనపైనుంచి నీరు పారి రెండు గ్రామాలకు మధ్య రహదారి మూసుకుపోయింది. ఇది గుర్తించిన వాడపాలెం మత్స్యకారులు సముద్ర తీరంలో గండి కొట్టారు. దీంతో పాముగెడ్డ ద్వారా వచ్చిన నీటి ప్రవాహం సముద్రంలో కలవడంతో ఉధృతి తగ్గింది.

కొత్తూరు : తాజా వర్షాలకు అనకాపల్లి మండలం కొప్పాక ఏలేరు కాలువ వద్ద రాకపోకలకు తీవ్ర అంతరాయ ఏర్పడింది. జాతీయ రహదారి కావడంతో నిత్యం ఈ మార్గంలో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తూ రద్దీగా ఉంటుంది. ఈ తరుణంలో కాలువపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా ధ్వంసమైంది. దీని వల్ల ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు గుర్తించారు. దీంతో సోమవారం పార చేతబట్టి రోడ్డుపై గుట్టలను సరి చేశారు. అంతేకాకుండా పెద్దపెద్ద గోతులు పడిన బ్రిడ్జి పైభాగాన్ని బ్రిక్‌తో కప్పివేయించారు.

అనకాపల్లిలో 426 ఎకరాల్లో నీట మునిగిన వరి పొలాలు

తుమ్మపాల : గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు అనకాపల్లి మండలంలో చాలాచోట్ల వరి పొలాలు నీట మునిగాయి. వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 426 ఎకరాల్లో పూర్తిగా వరి పంట నీట మునగగా, 585 మంది బాధిత రైతులను గుర్తించినట్టు చెబుతున్నారు. ప్రధానంగా దిబ్బపాలెం, కుంచంగి, బవులవాడ, తుమ్మపాల, మార్టూరు, శంకరం, రేబాక, నార్త్-2, సౌత్-2లలో వరి పంట నీట మునిగిందని వ్యవసాయాధికారులు తెలిపారు. దిబ్బపాలెం రెవెన్యూ పరిధిలోని గౌరమ్మ గెడ్డకు గండి పడడంతో భారీగా వర్షపునీరు పొలాల్లో చేరిందని, సుమారు 150 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని వివరించారు. అలాగే లోతట్టు ప్రాంతమైన తుమ్మపాల, శంకరం పంచాయతీల పరిధిలో సుమారు వంద ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగిందన్నారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఆయా పంట కాలువల నుంచి వర్షపునీరు ఆవఖండంలో భారీగా చేరడంతో ఆవఖండం పూర్తిగా చెరువును తలపిస్తుంది. ఇదిలావుంటే తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం దిబ్బపాలెంలో నీట మునిగిన వరి పొలాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. స్థానిక రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పంట నష్టం వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. నాయకులు కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, పీలా అప్పారావు, విల్లూరి సత్యనారాయణ, కరణం రాము, చదరం రూపావతి, మళ్ల అమ్మోజమ్మ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో సుమారు 350 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగినట్టు ఏవో ఉమాప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం ఎనిమిది వరకూ మండలంలో 71.8మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో అనేక గ్రామాల్లో వరి పొలాల్లో నీరు చేరింది. ఉద్దండపురం, గొడిచెర్ల, కాగిత, జి.జగన్నాథపురం, గ్రామాల పరిధిలో వరి పొలాలు నీట మునిగాయి. తాండవ జలాలను వదలడం వల్ల గొడిచెర్ల గ్రామానికి ఆనుకుని వున్న ఆవలోకి వరద నీరు చేరింది. సదరు పొలాలను అధికారుల బృందం, పలు పార్టీల నాయకులు పరిశీలించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నది

పాయకరావుపేట రూరల్ : భారీ వర్షాలు, తాండవ రిజర్వాయర్ గేట్లు తెరిచి నీరు విడుదల చేయడంతో మండలంలో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సత్యవరం వద్ద బ్రిడ్జి పైనుంచి నీరు జోరుగా పారుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమై బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేశారు. సీఐ అప్పన్న పరిస్థితిని పరిశీలించి పోలీసులతో గస్తీని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జయప్రకాశ్, నీటిపారుదల శాఖ ఏఈఈ జి.శ్రీరామ్మూర్తి పలు గ్రామాలలో పర్యటించారు. తాండవ నది నుంచి సుమారు పది వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నందున నదిలో ప్రవాహం ఇంకా పెరుగుతుందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇదిలావుంటే, మండలంలోని గుంటపల్లి, గోపాలపట్నం, నామవరం, రెవెన్యూ పరిధిలోని ఆవ ప్రాంతంలో సుమారు 300 ఎకరాల వరి పంట ముంపులోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆవ పాత రెండు గేట్లు, కొత్త రెండు గేట్లు పూర్తిగా తెరిచి నీరు కిందకి వదిలినట్లు నీటిపారుదల శాఖ ఏఈఈ జి. శ్రీరామ్మూర్తి తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తున్నందున ఆవలో నీరు క్రమేపీ తగ్గుతుందన్నారు. సుమారు 10 రోజులు పాటు నీరు పోయే పరిస్థితి లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరహా, సర్పా నదులు ఉగ్ర రూపం

కోటవురట్ల : భారీ వర్షాలకు మండలంలోని నదులు, వాగులు గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటలు నీట మునిగాయి. వరహా, సర్పా నదులు ఉగ్ర రూపందాల్చాయి. ఎగువన గొలుగొండ మండలంలోని రావణాపల్లి, రావికమతం మండలంలోని కళ్యాణపులోవ రిజర్వాయిర్‌లలో నీటి మట్టం భారీగా పెరగడంతో గేట్లు ఎత్తివేశారు. దీంతో సర్పా, వరహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోటవురట్ల పంచాయతీ రెండో వార్డులో విశ్రాంతి ఉపాధ్యాయుడు మూర్తి పెంకుటిల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పలుచోట్ల వరి, మొక్కజొన్న పత్తి పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని ఆయా రైతులు వాపోతున్నారు.

నక్కపల్లిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నక్కపల్లి : తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎప్పటి సమాచారం అప్పుడు తెలుసుకునేందుకు వీలుగా నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఈ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. తుఫాన్లు తదితర సమయాల్లో ప్రజలు కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 70131 56554కు ఫోన్ చేయాల్సిందిగా తహసీల్దార్ అంబేడ్కర్, డీటీ చైనులు, ఆర్ఐ కన్నబాబు కోరారు.


అనకాపల్లి : దిబ్బపాలెంలో మునిగిన వరిని చూపిస్తున్న బుద్ద


ఎలమంచిలిలోని శేషుగెడ్డ కాజ్‌వేను పరిశీలిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు



పారతో గోతులను పూడ్చుతున్న అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు


నక్కపల్లి : గొడిచెర్ల వద్ద మునిగిన పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

'పేట' ముంపుబారిన పడకుండా పటిష్ట చర్యలు : మంత్రి అనిత

పాయకరావుపేట, సెప్టెంబరు 9 : మండల కేంద్రం పాయకరావుపేట ముంపుబారిన పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తాజా వర్షాలకు తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో సోమవారం ఆమె పాండురంగస్వామి ఆలయం వెనుక నది లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఇరిగేషన్, రెవెన్యూ పీఆర్ శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. నదిని ఆనుకుని ఉన్న ఏటిఒడ్డు వీధి, చాకలిపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.


తాండవ నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

మంత్రి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

గోకివాడలో సంపద కేంద్రం ప్రారంభం

రాంబిల్లి, సెప్టెంబరు 9 : మండలంలోని గోకివాడ గ్రామంలో సంపద కేంద్రాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం డీపీవో ఆర్.శిరీషా, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మిలతో కలిసి వానపాములు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి సంపద కేంద్రాలు దోహదపడతాయన్నారు. వీటిని అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు, సర్పంచ్ నీరుకొండ శారదా సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు అల్లవరపు నాగేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ రాజు, పంచాయతీ కార్యదర్శి లీలావతి తదితరులతో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ శానిటేషన్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

తుమ్మపాల, సెప్టెంబరు 9 : పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం సదరు కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. గత ఆరు నెలలుగా శానిటేషన్ కార్మికులకు జీత బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు శివలక్ష్మి, జానకి, పూడి వెంకటలక్ష్మి, సత్యవతి, వరలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయ నిధికి 'రక్షిత్, సాయినార్' రూ. 10 లక్షలు విరాళం

పరవాడ, సెప్టెంబరు 9 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఫార్మాసిటీలోని రక్షిత్ డ్రగ్స్, సాయినార్ ఫార్మా యాజమాన్యాలు సంయుక్తంగా రూ.10లక్షలు విరాళం అందజేశారు. ఇందుకు సంబంధించి చెక్కును సోమవారం పరిశ్రమల శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌కు రక్షిత్ డ్రగ్స్ గ్రూప్ ఎండీ అవినాష్ అందించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అభ్యర్థన మేరకు తమ వంతు సాయంగా రూ. 10లక్షలు విరాళాన్ని అందజేసినట్టు రక్షిత్ గ్రూప్ ప్రతినిధి ఎం.పాపయ్యదొర తెలిపారు.

అలాగే, ఫార్మాసిటీలోని సియాంక ఫార్మా సూటికల్ పరిశ్రమ యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం రూ. ఐదు లక్షలు విరాళాన్ని సమకూర్చింది. దీనికి సంబంధించిన చెక్కును పరిశ్రమ ఆపరేషన్ విభాగం డైరెక్టర్ జెట్టి సుబ్బారావు సోమవారం పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ పి. ముకుందరావుకు అందజేశారు.

వరద బాధితులకు రోటరీ క్లబ్ సాయం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక రోటరీక్లబ్ ప్రతినిధులు పలు వస్తువులను ప్రత్యేక వాహనంలో సోమవారం తరలించారు. రోటరీక్లబ్ అనకాపల్లి జిల్లా 3020 గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు పట్టణ ప్రజల సహకారంతో చీరలు, దుప్పట్లు, పలు వస్తువులను విజయవాడలోని బాధితులకు పంపిణీ చేయడం కోసం తరలించామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ద రమణాజీ, అనిల్, బుద్ద భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- తుఫాన్ నష్టాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

పరవాడ మండల సమావేశంలో ఎమ్మెల్యే 'పంచకర్ల' ఆదేశం

పరవాడ, సెప్టెంబరు 9 : తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా సమన్వయంగా పనిచేయడంతో పాటు జరిగిన నష్టాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదేశించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన సోమవారం ఇక్కడ జరిగిన పరవాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యంగా వైద్య, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలు ప్రబలే అవకాశమున్నందున పంచాయతీ కార్యదర్శులంతా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టాలన్నారు. మండల పరిధిలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లంకెలపాలెం నుంచి అసకపల్లి వరకు, పరవాడ సినిమా హాల్ జంక్షన్ నుంచి బొట్టవానిపాలెం జంక్షన్ వరకు రహదారుల మరమ్మతుకు రూ.95 లక్షలు సింహాద్రి సీఎస్ఆర్ నిధులను వెచ్చించడం జరుగుతుందన్నారు. వైద్యాధికారి కనకఅప్పారావు మాట్లాడుతూ సాధారణ జ్వరాలు మినహా మలేరియా, డెంగ్యూ జ్వరాలు ఎక్కడా నమోదు కాలేదన్నారు. ఆశ కార్యకర్తలు లేకపోవడం వల్ల మూడేళ్లుగా తమ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పన ప్రస్తావించారు. 108 వాహనం పరవాడలో ఏర్పాటు చేయాలని పరవాడ, రావాడ సర్పంచ్‌లు సిరపురపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు కోరారు. ఎంపీడీవో హేమసుందరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

వేగి గౌరీసు వీధిలో ఆకట్టుకున్న గణనాథుడు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక గవరపాలెం వేగి గౌరీసు వీధిలో స్థానికులు ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వినాయక ప్రతిమను గోమేథ విష్ణుచక్రాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు.



సీహెచ్‌సీ కార్మికులు వినూత్న నిరసన

ఎలమంచిలి, సెప్టెంబరు 9 : డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎలమంచిలి సీహెచ్‌సీ ముందు సోమవారం ఆస్పత్రి కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ తదితర విభాగాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులకు బకాయి వేతనాలు, అలవెన్స్‌లను చెల్లిచాలని నినాదాలు చేశారు.

ముంచేసిన వాన

... 5వ పేజీ తరువాయి

అంచనా ప్రకారం సోమవారం సాయంత్రానికి వివిధ మండలాల్లో 4,420 మంది రైతులకు చెందిన 1,528 హెక్టార్లలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. రూ.2.59 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. మండలాల వారీగా వరి పంట నష్టం వివరాలను పరిశీలిస్తే... అత్యధికంగా మునగపాక మండలంలో 613 మంది రైతులకు చెందిన 134.6 హెక్టార్లలో వరి పంట మునిగిపోయింది. అనకాపల్లి మండలంలో 172 హెక్టార్లు, చోడవరంలో 208 హెక్టార్లు, కశింకోటలో 185, నక్కపల్లిలో 125, కె.కోటపాడులో 82, ఎలమంచిలిలో 132, పాయకరావుపేటలో 40, ఎస్.రాయవరంలో 167.2, కోటవురట్లలో 39.4, సబ్బవరంలో 52, బుచ్చెయ్యపేటలో 33.99, మాకవరపాలెంలో 9, రోలుగుంటలో 14, నర్సీపట్నంలో 28, రాంబిల్లిలో 46, గొలుగొండలో 5.4, అచ్యుతాపురంలో 10, పరవాడలో 1.6, చీడికాడలో 13, దేవరాపల్లిలో 3.24, నాతవరంలో 6, రావికతమతంలో 21.45 హెక్టార్లులో వరి పంటకు నష్టం వాటిల్లింది. కాగా వరి పొలాల్లో నుంచి వర్షపు నీరు బయటకు పోయి తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. పైరుకు చీడపీడలు సోకకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం మందును కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

రిజర్వాయర్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

క్యూసెక్కులు, ఆయకట్టుకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

పొంగిపొర్లిన 'రావణాపల్లి'

గొలుగొండ: మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ పొంగి పొర్లుతున్నది. ఎగువ ప్రాంతంలోని రాళ్లగెడ్డ, తురబాల గెడ్డల నుంచి 250 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. రిజర్వాయర్ ఇప్పటికే నిండడంతో వచ్చిన నీరు వచ్చినట్టు పొర్లుకట్ట మీదుగా దిగువకు పోతున్నది.

తాండవ నుంచి 8 వేల క్యూసెక్కులు విడుదల

నాతవరం: మండలంలోని తాండవ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా, నాలుగైదు రోజుల క్రితమే రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీంతో అధికారులు స్పిల్‌వే గేట్లు కొంతమేర ఎత్తి అదనపు నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. అయితే పరివాహక ప్రాంతంలో ఆదివారం భారీ వర్షాలు కురవడంతో పలు గెడ్డల నుంచి సోమవారం 8,700 వేల క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి వస్తున్నది. అధికారులు మూడు స్పిల్‌వే గేట్లను అడుగుమేర ఎత్తి 8,900 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి రిజర్వాయర్ నీటిమట్టం 379.5 అడుగులు వుందని ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు.

కోనాంకు వెయ్యి క్యూసెక్కుల వరద

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయంలోకి 1000 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, సోమవారం సాయంత్రానికి 98.2 మీటర్లు వుంది. మెయిన్ గేట్లు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


కృష్ణాదేవిపేట- కొంగసింగి రహదారి మధ్యలో ప్రవహిస్తున్న చెరువు


నాతవరం : వెర్రిగెడ్డ ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్ఐ రామారావు


నర్సీపట్నం మండలం జోగినాథునిపాలెంలో చెరువులా పొలాలు

ఎటు చూసినా వరదే

- వాయుగుండం కారణంగా భారీ వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగిపొర్లుతున్న నదులు, వాగులు, వంకలు
- ముంపులో పలు చోట్ల వరి పొలాలు


మాకవరపాలెం మండలం తాడపాల వద్ద ఉరకలేస్తున్న సర్పా నది

నర్సీపట్నం, అక్టోబరు 9 : వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని జలాశయాలు, నదులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఎటు చూసినా నీరే కనిపిస్తోంది. నర్సీపట్నంలోని బలిఘట్టంలో వరహానది ఉరకలేస్తోంది. ఉత్తర వాహిని వద్ద నదిపై నిర్మించిన చెక్ డ్యామ్ మీద నుంచి నీరు పరవళ్లు తొక్కుతోంది. పాకలపాటి గురుదేవుల ఆశ్రమం వద్ద స్నాన ఘట్టాలు నీట మునిగాయి. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో నిర్మించిన వంతెన పిల్లర్లకు మూడు అడుగుల వరకు నీటి ప్రవాహం కనిపించింది. పెద్ద చెరువు పొర్లుకట్టు నుంచి జాలువారిని నీరు శారదానగర్‌లోని ప్రైవేటు లేఅవుట్‌ను ముంచెత్తింది.

నర్సీపట్నం రూరల్ : భారీ వర్షాలకు మండలంలో 98 మంది రైతులకు సంబంధించి 28 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని వ్యవసాయ శాఖాధికారి ప్రాథమిక అంచనా వేశారు. ఆదివారం నుంచి తెరిపివ్వకుండా కురిసిన వర్షానికి పెదబొడ్డేపల్లి సమీపంలోని జోగినాథునిపాలెం, బలిఘట్టం, వేములపూడిలలో పంట పొలాలు నీట మునిగాయి.

గొలుగొండ : మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో సోమవారం కొత్తమల్లంపేట, రావణాపల్లి, గొలుగొండ, పాకలపాడు, చీడిగుమ్మల గ్రామాల్లో ఏడీఏ శ్రీదేవి, మండల వ్యసాయాధికారిణి సుధారాణి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరి పొలాల్లో చేరిన నీరు రెండు మూడు రోజుల్లో బయటకు పోయే విధంగా రైతులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇదిలావుంటే, రావణాపల్లి రిజర్వాయర్ వద్ద కోతకు గురికావచ్చునని భావించే ప్రదేశాలను సోమవారం గ్రావెల్‌తో పూడ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరిగేషన్ విభాగం ఏఈ సూర్య, స్థానిక సర్పంచ్ సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి. రిజర్వాయర్ కింద గ్రామమైన రావణాపల్లి, గుండుపాల, కొత్తూరు, బలిఘట్టం గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వార సూచించారు.

కృష్ణాదేవిపేట : వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు చిత్తడిగా మారాయి. ఎక్కడికక్కడ గోతులు పడడంతో అందులో వర్షపు నీరు చేరింది. దీంతో రోడ్డు ఎక్కడో, గొయ్యి ఎక్కడో గుర్తించలేక వాహనదాదుల తీవ్ర అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా కృష్ణాదేవిపేట- కొంగసింగి రహదారి మధ్యలో చెరువు నిండి రోడ్డుపై ప్రవహించింది. దీంతో రోడ్డు కోతకు గురైయింది. పాతకృష్ణాదేవిపేట-పల్లావూరు, రామచంద్రపురం జంక్షన్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తుంది. ఏఎల్‌పురం, చోద్యంలో గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి.

గన్నవరం మెట్ట వద్ద వెర్రి గెడ్డ ఉరకలు

నాతవరం : భారీ వర్షాలకు మండలంలోని గన్నవరం మెట్ట వద్ద గల వెర్రిగెడ్డ (దొంగ గెడ్డ) ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆర్అండ్‌బీ రోడ్డుపై నుంచి పారుతుండడంతో నర్సీపట్నం నుంచి తుని వెళ్లే వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గెడ్డ ఉధృతి తగ్గే వరకు మాకవరపాలెం మీదుగా వెళ్లాలని ఎస్ఐ రామారావు వాహనదారులకు సూచించారు. తుని నుంచి నర్సీపట్నం వెళ్లే వాహనాలు కోటనందూరు వరకు మాత్రమే రావాలన్నారు. ఎస్ఐ రామారావు దగ్గరుండి గెడ్డ వద్ద ఎవ్వరూ వాహనాలు దాటకుండా హెచ్చరికలు జారీ చేశారు.

'సర్పా'లో భారీగా పెరిగిన ప్రవాహం

మాకవరపాలెం: భారీ వర్షాలకు మండలంలో సర్పా, వరహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రావికమతం మండలం కళ్యాణపులోవ రిజ్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో సర్పానదిలోకి భారీగా నీరు చేరుతుంది. దీంతో పల్లపు ప్రాంతమైన తాడపాల గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నది వద్దకు ఎవరూ వెళ్ల వద్దంటై రెవెన్యూ అధికారులు ప్రజలకు సూచించారు.

రిజర్వాయర్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

అడుగుమేర ఎత్తి 8,900 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి రిజర్వాయర్ నీటిమట్టం 379.5 అడుగులు వుందని ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు.

పొంగిపొర్లిన 'రావణాపల్లి'

గొలుగొండ: రావణాపల్లి రిజర్వాయర్ పొంగి పొర్లుతున్నది. ఎగువ ప్రాంతంలోని రాళ్ల గెడ్డ, తురబాలగెడ్డల నుంచి 250 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. రిజర్వాయర్ ఇప్పటికే నిండడంతో వచ్చిన నీరు వచ్చినట్టు పొర్లుకట్ట మీదుగా దిగువకు పోతున్నది.

కోనాంకు వెయ్యి క్యూసెక్కుల వరద

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయంలోకి 1000 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, సోమవారం సాయంత్రానికి 98.2 మీటర్లు వుంది. మెయిన్ గేట్లు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ముంచేసిన వాన

... 5వ పేజీ తరువాయి

అంచనా ప్రకారం సోమవారం సాయంత్రానికి వివిధ మండలాల్లో 4,420 మంది రైతులకు చెందిన 1,528 హెక్టార్లలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. రూ.2.59 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. మండలాల వారీగా వరి పంట నష్టం వివరాలను పరిశీలిస్తే... అత్యధికంగా మునగపాక మండలంలో 613 మంది రైతులకు చెందిన 134.6 హెక్టార్లలో వరి పంట మునిగిపో యింది. అనకాపల్లి మండలంలో 172 హెక్టార్లు, చోడవరంలో 208 హెక్టార్లు, కశింకోటలో 185, నక్కపల్లిలో 125, కె.కోటపాడులో 82, ఎలమంచిలిలో 132, పాయకరావుపేటలో 40, ఎస్.రాయవరంలో 167.2, కోటవురట్లలో 39.4, సబ్బవరంలో 52, బుచ్చెయ్యపేటలో 33.99, మాకవరపాలెంలో 9, రోలుగుంటలో 14, నర్సీపట్నంలో 28, రాంబిల్లిలో 46, గొలుగొండలో 5.4, అచ్యుతాపురంలో 10, పరవాడలో 1.6, చీడికాడలో 13, దేవరాపల్లిలో 3.24, నాతవరంలో 6, రావికతమతంలో 21.45 హెక్టార్లులో వరి పంటకు నష్టం వాటిల్లింది. కాగా వరి పొలాల్లో నుంచి వర్షపు నీరు బయటకు పోయి తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. పైరుకు చీడపీడలు సోకకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం మందును కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుచ్చెయ్యపేట మండలంలోని భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎన్)రోడ్డులో పెద్దేరు వరదతో మునిగిన వడ్డాది కాజ్‌వే, కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. బంగారుమెట్ట కూడలి వద్ద భారీ గోతులను పూడ్చక పోవడంపై ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిర్వహణ పనులు చేపట్టాలని ఆదేశించారు. గొలుగొండ మండలం కొత్తఎల్లవరంలో పలు ఇళ్లల్లోకి వర్షంనీరు చేరింది. ధారగెడ్డ పొంగడంతో జోగంపేట జంక్షన్- చిట్టెంపాడు రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తుని-నర్సీపట్నం మార్గంలో నాతవరం మండలం గన్నవరం మెట్ట వద్ద ఎర్రిగెడ్డ (దొంగ గెడ్డ) ఉధృతంగా ప్రవహించడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. తాండవ రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతోపాటు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో పాయకరావుపేట మండలంలో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. సత్యవరం వద్ద బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహిస్తున్నది. దీంతో పోలీసు అధికారులు అప్రమత్తమై వంతెన మీదుగా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారిలో చోడపల్లి వద్ద భారీ మర్రిచెట్టు రోడ్డుకి అడ్డంగా కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనకాపల్లి మండలంలోని దిబ్బపాలెం, కుంచంగి, బవులవాడ, తుమ్మపాల, మార్టూరు, శంకరం, రేబాక, తదితర గ్రామాల్లో 426 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. శంకరం, బొజ్జన్నకొండ, దిబ్బపాలెంలో మునిగిన పొలాలను ఎంపీ సీఎం రమేశ్ పరిశీలించారు. పాయకరావుపేట, నక్కపల్లి మండలాల సరిహద్దులోని ఆవ ప్రాంతంలో సుమారు 300 ఎకరాల్లో వరి పంట రెండు రోజుల నుంచి నీటి ముంపులోనే వుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో దాదాపు 10 రోజుల వరకు ముంపు తొలగదని వాపోతున్నారు.ఎస్.రాయవరం మండల సోముదేవుపల్లి వద్ద వరహా నది వరద ఉధృతి అధికంగా వుండడంతో గట్టుకోతకు గురవుతున్నది. ఎస్.రాయవరం వద్ద వంతెన మీదుగా వరహా నది వరద ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను నిలుపుదల చేశారు.

సబ్ జైలును సందర్శించిన జైళ్ల శాఖ డీఐజీ

నర్సీపట్నం, సెప్టెంబరు 9 : ఇక్కడి సబ్ జైలును జైళ్ల శాఖ డీఐజీ ఎం.రవికుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఉదయం సబ్ జైలుకు విచ్చేసిన ఆయన రికార్డులు పరిశీలించారు. జైలు పర్యవేక్షణాధికారి ఎం.సన్యాసిరావును ముద్దాయిల భోజన సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎట్టకేలకు నర్సీపట్నం, రూరల్ సీఐల నియామకం

నర్సీపట్నం, సెప్టెంబరు 9 : ఎట్టకేలకు నర్సీపట్టణ, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నియామకం జరిగింది. వీఆర్‌లో ఉన్న గోవిందరావును పట్టణ సీఐగా బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సీఐగా పని చేసిన కాంతికుమార్ గత రెండు నెలలుగా వీఆర్‌లో ఉన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రేవతమ్మను బదిలీ చేశారు. ఆమె విధులలో చేరాల్సి ఉంది.

రుత్తల లచ్చాపాత్రుడుకు నివాళులు


లచ్చాపాత్రుడు విగ్రహం వద్ద రాజేశ్ నివాళి

నర్సీపట్నం, సెప్టెంబరు 9 : స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు తాత రుత్తల లచ్చాపాత్రుడు వర్థంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సోమవారం ఇక్కడ నివాళుల ర్పించారు. లచ్చాపాత్రుడు, వరహాలదొర విగ్రహాలకు 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, దివ్యలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

చమ్మచింతలో వైద్య శిబిరం ఏర్పాటు


మహిళకు వైద్యం అందిస్తున్న బృందం

నాతవరం, సెప్టెంబరు 9 : చమ్మచింత గ్రామంలో సోమవారం నాతవరం పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో జ్వరపీడితులు అధికంగా ఉండడంతోచమ్మచింతలో జ్వరాల విజృంభణ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెనువెంటనే స్పందించిన అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ రాజేష్‌నాయుడు బృందం సూమారు ఎనభై మందికి పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యదర్శి టి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో మరమ్మతు పనులు

ఆర్అండ్‌బీ ఎస్ఈ క్రాంతిమతి


వడ్డాది కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఈ

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 9: భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల మరమ్మతు పనులకు రూ.80 లక్షలు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ ఎస్ఈ క్రాంతిమతి తెలిపారు. సోమవారం వరద నీట మునిగిన వడ్డాది కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ, నీటి ప్రవహం తగ్గిన వెంటనే బీఎన్ రోడ్డులో తాచేరు డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టి రవాణాను పునరుద్ధరిస్తామన్నారు. అలాగే ఎన్‌డీబీ నిధులతో నూతన వంతెన నిర్మాణ పనులు చేపడతామన్నారు. నర్సీపట్నం-అడ్డురోడ్డులో 20వ కిలోమీటరు వద్ద దెబ్బతిన్న పాత ఐరెన్ గడ్డ వంతెన పక్కన రూ.15 లక్షలతో తాత్కలిక డైవర్షన్ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. శాశ్వత వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లతో అంచనాలు తయారు చేసి ఆమోదానికి పంపామన్నారు. చీడికాడ మండలం ఖండివరం వద్ద అప్రోచ్ రోడ్డుకు గండి పడిందన్నారు. బీఎన్ రోడ్డులో రావికమతం మండలం దొండపూడి వద్ద కల్వర్టు దెబ్బతినడంతో ట్రాఫిక్‌ను మళ్లించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేష్, డీఈ ధనుంజయ్, ఏఈఈ సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెర్రరిస్టు పాలనను తలపించిన జగన్ పాలన

- చంద్రబాబు అరెస్టుకు తగిన బుద్ధి చెప్పిన ఏపీ ప్రజలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు


విలేకరులతో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 9: టెర్రరిస్టు పాలనను తలపించేలా ఐదేళ్ల జగన్ పాలన సాగిందని తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. వడ్డాది పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులయాయన మాట్లాడారు. చంద్రబాబును అర్ధరాత్రి అక్రమంగా చేసిన అరెస్టుతో 70 దేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు రగలిపోయారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు కట్టబెట్టడం ద్వారా జగన్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్‌లో మూడు వేల కోట్ల అవినీతి జరిగిందని అరెస్టు చేసి, చివరికి మూడు పైసలు కూడా అవినీతికి పాల్పడినట్టు నిరూపించలేకపోయారన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన సాగుతున్నదని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తుల్లోనూ చంద్రబాబు సమర్థంగా పని చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, టీడీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్, నాయకులు సాయం శేషు, దొండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టుకు టీడీపీ నేతల మరమ్మతు


కల్వర్టు మరమ్మతు చూపుతున్న నేతలు

రావికమతం, సెప్టెంబరు 9: బీఎన్ రోడ్డులో దొండపూడి వద్ద కుంగిపోయిన కల్వర్టుకు టీడీపీ నాయకులు మరమ్మతులు చేశారు. సోమవారం ఉదయం ఈ కల్వర్టును నర్సీపట్నం ఆర్అండ్‌బీ డీఈ నాగమోహన్ పరిశీలించి ప్రమాదాలు జరగకుండా తాత్కలికంగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆపై టీడీపీ నాయకులు వెదురుపర్తి వెంకటాచారి, జి.ఎరుకునాయకుడు తదితరుల సహకారంతో రెండు ట్రాక్టర్ల రాయి ముక్కలు, ఐదు లోడ్ల కంకర వేసి వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా చదును చేశారు.

చెరువుల ఆక్రమణలు తొలగించాలి

చోడవరం, సెప్టెంబరు 9: చెరువులు, కాలువల ఆక్రమణలను తొలగించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం నరసయ్యపేట, లక్ష్మీపురం, అంకుపాలెం, గౌరీపట్నం ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలు, చెరువులు ఆక్రమణలకు గురికావడంతో వరద నీరు నిల్వ ఉండిపోయి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టడంతో పాటు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు బుద్ధా అమరనాథ్, సదరం సూర్యనారాయణ పాల్గొన్నారు.


చీడికాడ: కండివరం సమీపంలో కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు


రావికమతం: దొండపూడి రాణా వద్ద నీటి మునిగిన వరి పొలాలు


దేవరాపల్లి: బోట్లు కొట్టుకుపోయాయని వాపోతున్న బొడ్డపాడు మత్సకారులు

అన్నదాతకు నష్టం


మాడుగుల-ఖండివరం రహదారిలో కోతకు గురైన కల్వర్టు

చోడవరం, సెప్టెంబరు 9: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజుల పాటు విరామం లేకుండా కురిసిన భారీ వర్షాలు అన్నదాతను ముంచేశాయి. పంట పొలాలు నీట ముంపులోనే ఉన్నాయి. వరి, చెరకు పంటలకు భారీ నష్టం వాటిల్లింది. రహదారులు దెబ్బతినగా, కల్వర్టులు కోతకు గురయ్యాయి.

మండలంలోని చాకిపల్లి, రామజోగిపాలెం, కన్నంపాలెం, తిమ్మనపాలెం, బెన్నవోలు, భోగాపురం, గౌరీపట్నం ప్రాంతాల్లో వరి పొలాలు, చెరకు తోటలు నీటమునిగాయి. పెద్దేరు రిజర్వాయర్ నుంచి భారీగా నీరు దిగువకు విడుదల చేయడంతో వందలాది ఎకరాల వరి పంట దెబ్బతింది. కన్నంపాలెం, చాకిపల్లి ప్రాంతాల్లో వరి, చెరకు తోటల్లో పీకల్లోతు నీరు చేరింది. లక్ష్మీపురం చెరువు నిండిపోయి నీరు పొర్లుగట్టు మీదనుంచి పారడంతో లక్ష్మీపురం, నరసయ్యపేట ప్రాంతాల్లో వరి పంట నీటమునిగింది. ఖండేపల్లి, జి.జగన్నాథపురం, గవరవరం, జుత్తాడ ప్రాంతాల్లో శారదానది ఉధృతి కారణంగా వరి పొలాల్లోకి భారీగా నీరు చేరింది. తహసీల్దార్, ఇతర శాఖల అధికారులు పరిశీలించి, జన్నవరం వంతెన వద్ద ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే పట్టణంలోని కో ఆపరేటివ్ కాలనీ, బాలాజీనగర్, రెల్లికాలనీ, దుడ్డువీధి, పూర్ణాథియేటర్, బానయ్యకోనేరు నీటి ముంపులో ఉండిపోయాయి. ఈ కాలనీలను ఎమ్మెల్యే రాజు పరిశీలించారు. అలాగే ద్వారకానగర్‌లో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లక్ష్మీపురం దిగువన పంట పొలాలను వరద ముంచెత్తడంతో ఎమ్మెల్యే వెళ్లి స్థానికులతో మాట్లాడారు. కాజ్‌వే శిథిలావస్థకు చేరడంతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్యాంసుందర్, పంచాయతీ ఈవో నారాయణరావు, సీఐ అప్పలరాజు, మాజీ వైస్ ఎంపీపీ బి.నానికుమార్, వార్డు సభ్యులు టి.శ్రీనివాసరావు, కె.శంకర్, నేమాల హరి, ఎంపీటీసీ సభ్యుడు నాయుడు, నాయకులు బి.దేముడు, డి.శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మొల్లి కృష్ణ, ఎస్.దేముడు, చిన్న, మొండి చిన్నయ్య, సిరిసోళ్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో చెరువులు, గెడ్డలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. కళ్యాణపులోవ నీటి ప్రవాహంతో దొండపూడి రాణా వద్ద వరి పొలాలు నీటి ముంపుకు గురయ్యాయి. జి.చీడిపల్లి నల్లచెరువు నీటి ఉధృతికి జి.చీడిపల్లి బీఎన్ రోడ్డును ఆనుకోని ఉన్న వరి పొలాలు నీటి మునిగాయి. మేడివాడ పెద్ద చెరువు పొంగి పారడంతో రావికమతం అద్దెపల్లి పోలాలు పీకలోతు ముంపులో ఉన్నాయి. తహసీల్దార్ మహేశ్వరరావు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, వీఆర్వోలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్ద గెడ్డ ఉధృతితో శరభవరం-వడ్డిప వెళ్లే రహదారిలో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అర్ల, లోసింగి, కొరుప్రోలు గిరిజన గ్రామాల గెడ్డల నుంచి వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. ఈ మార్గంలో వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముంపులోనే పంట పొలాలు

- వరి, చెరకు పంటలకు భారీ నష్టం
- దెబ్బతిన్న రహదారులు, కోతకు గురైన కల్వర్టులు
- ఆందోళనలో రైతులు, గ్రామీణ ప్రజలు

మాడుగులలో...

మాడుగుల రూరల్: మండలంలో భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువుల్లో నీరు సమృద్ధిగా చేరింది. వరి పొలాలు నీటమునిగాయి. మాడుగుల-ఖండివరం మార్గంలో శివాలయం వద్ద కల్వర్టుపై నుంచి పాలగెడ్డ ఉధృతంగా పారుతున్నది. దీంతో గెడ్డ అవతల ఉన్న గదబూరు గిరిజనులు రాకపోకలుకి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఖండివరం రోడ్డులో పడిపోయిన తాటిచెట్లను రైతులే తొలగించుకున్నారు. ఖండివరం దగ్గరలోని మోసూరి, గెంజివారి కళ్లాల వద్ద చెరువు నుంచి వచ్చే కాలువ నీటి ఉధృతికి రోడ్డు, కల్వర్టు కొట్టుకుపోయాయి. రోడ్డుకు భారీ గండి ఏర్పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వీరవిల్లి అగ్రహారం వద్ద పెద్దేరు పరవళ్లు తొక్కుతోంది.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: రైవాడ జాశయంలో వేసిన బోట్లు, వలలు వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. సమ్మెద బోడిగరువు రోడ్డు కోతకు గురైంది. పాత బొడ్డపాడు, కొత్తబొడ్డపాడు, లోవముకుందపురం గ్రామాలకు చెందిన మత్సకారులు వలలు, బోట్లు ధ్వంసమయ్యాయి. సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని వంతి నాయుడు, తమ్మయ్య, ఎరకన్నదొర, రాము తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

చీడికాడలో...

చీడికాడ: అధిక వర్షాలకు ఖండివరం సమీపంలోని గంజివారి కళ్లాల వద్ద కాజ్‌వే సోమవారం కొట్టుకుపోయింది. దీంతో ఖండివరం నుంచి మాడుగులకు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాణి, ఎంపీడీవో జయప్రకాశ్‌రావు తక్షణమే వెళ్లి పరిశీలించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.

11న మెగా కంటి వైద్య శిబిరం

చోడవరం, సెప్టెంబరు 9: పట్టణంలోని బ్రాహ్మణ భవనం వద్ద గణేశగాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 11న మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్టు ప్రతినిధి ఉపాధ్యాయుల శ్రీనివాస్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని చెప్పారు. ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

కె.కోటపాడు, సెప్టెంబరు 9: మండలంలోని మేజరు పంచాయతీ చౌడువాడలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఎంపీడీవో ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లే మార్గాలను జేసీబీ యంత్రాలతో తవ్విస్తున్నారు. చిట్టిగెడ్డ, పెద్దగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, సమీప ప్రాంతాల ప్రజలు నీటిలో దిగరాదని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో దోమలు విజృంభించకుండా బ్లీచింగ్, ఫినాయిల్ జల్లాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, కార్యదర్శి రామానాయుడు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు పాల్గొన్నారు.

బొర్రచింత గ్రామాన్ని అన్ని విధాలా ఆదుకుంటా

- మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


బొర్రచింత గ్రామస్థులకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఎమ్మెల్యే

దేవరాపల్లి, సెప్టెంబరు 9: మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీ శివారు బొర్రచింత గ్రామస్థులను అన్ని విధాలుగా ఆదుకుంటానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. వర్షాల కారణంగా గ్రామస్థులు పడిన ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని 15 కుటుంబాలకు కూటమి నాయకులతో కలసి సోమవారం ఆయన నిత్యావసర సరకులను అందజేశారు. అలాగే వాలాబు నుంచి బొర్ర చింతకు వెళ్లే రోడ్డుకు రూ.87 లక్షలు మంజూరు చేశారు. రహదారులు, తాగునీరుతో పాటు వివిధ సమస్యలను సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకు వెళ్లారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో రహదారుల నిర్మాణానికి రూ.80 లక్షలు, శివారు గ్రామాల రోడ్ల నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో వీటి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నగరం పాలెం రక్షిత నీటి పథకం మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం రైవాడ జలాశయాన్ని సందర్శించి, నీటి నిల్వలపై డీఈఈ సత్యం నాయుడును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, నాయకులు పోతల పాత్రునాయుడు, చెరకాన సూర్యనారాయణ, దేముళ్లు, బాబూరావు, బండారు గోవింద, తదితరులు పాల్గొన్నారు.